



ఇర్రిపాకలో నెహ్రూని పూలమాలతో అభినందిస్తున్న దృశ్యం



నిమ్మకాయల చినరాజప్ప, పెద్దాపురం | వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట | జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట | బండారు సత్యానందరావు, కొత్తపేట | నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి | దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), ముమ్మిడివరం | పంతం నానాజీ, కాకినాడ రూరల్ | ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం సిటీ | బత్తుల బలరామకృష్ణ, రాజానగరం | యనమల దివ్య, తుని | మహాసేన రాజేశ్, గన్నవరం

పెద్దాపురంలో నిలిచిన అభివృద్ధి కొనసాగిస్తా : చినరాజప్ప

రెండు దఫాలు పెద్దాపురం నియోజకవర్గం నుంచి గెలుపొందా. మొదటి దఫాలో పెద్దాపురం నియోజకవర్గాన్ని వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశా. రెండో దఫా గెలుపొందినా వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. మూడో దఫా తిరిగి పెద్దాపురం నుంచే పోటీ చేసే అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉంది. అదే రేపటి నుంచి ప్రచారంలో ప్రజలకు వివరించి గెలుపు సునాయాసం చేసుకుంటా.

మండపేట సీటు బాబు, పవన్‌కు బహుమతిగా ఇస్తా : వేగుళ్ల

మూడోసారి మండపేట నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సీటును చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు బహుమతిగా ఇస్తా. మొదటి జాబితాలో తనకు చోటు దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు.తనను ఆదరించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా.

జగ్గంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : జ్యోతుల నెహ్రూ

గతేడాది ఫిబ్రవరిలోనే చంద్రబాబు జగ్గంపేట వచ్చిన సందర్భంలోనే నన్ను అభ్యర్థిగా ప్రకటించారు. పవన్‌కల్యాణ్ ఆశీస్సులతో జగ్గంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా.

8వ సారి కొత్తపేట నుంచి పోటీ : బండారు సత్యానందరావు

టీడీపీ కొత్తపేట అసెంబ్లీ సీటు కేటాయించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు రుణపడి ఉంటా. 1989 నుంచి ఇప్పటి వరకూ 7 సార్లు అసెంబ్లీకి పోటీ చేసి మూడు సార్లు గెలిచా. ఇప్పుడు 8వ సారి ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నా. తెలుగుదేశం, జనసేన పార్టీల శ్రేణులతో కలిసి ఒక ప్రణాళికతో ముందుకు వెళతా. రాష్ట్రంలో జరుగుతున్న వైసీపీ అరాచకాలకు, అవినీతికి ప్రజలు ముగింపు పలికేందుకు ఎదురుచూస్తున్నారు. ప్రజలంతా టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

అనపర్తిలో జనసేన సహకారంతో విజయం సాధిస్తా : నల్లమిల్లి

తనపై నమ్మకంతో టికెట్ కేటాయించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు.. అనపర్తిలో జనసేన సహకారంతో విజయం సాధిస్తా.రామకృష్ణారెడ్డి విజయానికి సంపూర్ణ మద్దతు అందజేస్తున్నామని జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు.

ముమ్మిడివరంలో విజయం సాధిస్తా : దాట్ల

నాపై నమ్మకంతోనే టీడీపీ ముమ్మిడివరం టిక్కెట్ కేటాయించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు వెళతా. టీడీపీ, జనసేన నాయకులతో పనిచేసి విజయం సాధిస్తా.

కాకినాడ రూరల్‌లో సమన్వయంతో ముందుకు : పంతం నానాజీ

నాపై నమ్మకంతో కాకినాడ రూరల్ సీటును ఖరారు చేసిన పవన్‌కల్యాణ్, చంద్రబాబుకి కృతజ్ఞతలు.టీడీపీ-జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల్ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళతాం.నియోజకవర్గంలో అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కృషి చేస్తా. కాగా పొత్తులో టిక్కెట్ సాధించిన నానాజీని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణ దంపతులు అభినందించారు. పార్టీ ఆదేశాల మేరకు సహకరిస్తామన్నారు.

రాజమహేంద్రవరాన్ని టీడీపీ కంచుకోటగా చేస్తా : ఆదిరెడ్డి వాసు

చంద్రన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. ఈ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ కాబోతుంది. భరత్ కాదు కాదా ఆటువంటి వాళ్ళు వందమంది ఉన్నా వైసీపీకి డిపాజిట్లు కూడా రావు. రాజమహేంద్రవరాన్ని టీడీపీ కంచుకోటగా మారుస్తా. మాపై నమ్మకంతో ఈ రోజు నాకు సీటు ఇచ్చిన చంద్రబాబు, నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు.

రాజానగరంలో.. జన సైనికుడినే : బత్తుల బలరామకృష్ణ

జనసేనలో ఒక సామాన్య జనసైనికుడిగా పార్టీ కోసం అహర్నిశలు పనిచేశా. నిజాయితీగా పనిచేసిన కార్యకర్తలను పవన్‌కల్యాణ్ భుజాన ఎత్తుకుని మోస్తారు.నా విషయంలో అదే రుజువైంది.చంద్రబాబు, పవన్ రాజానగరం నియోజకవర్గానికి తన పేరు ప్రకటించడం ఆనందంగా ఉంది. రేపటి నుంచే ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళతా.

తుని నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతా : యనమల దివ్య

పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. నా తండ్రి యనమల రామకృష్ణుడు అడుగుజాడల్లో ముందుకెళతా.తుని నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడతా. అవినీతి రహిత పాలనకు శ్రీకారం చుట్టి తుని నియోజకవర్గ ప్రజలకి సేవలందిస్తా.

గన్నవరం టిక్కెట్ ఊహించలేదు : మహాసేన రాజేశ్

ఎమ్మెల్యే టిక్కెట్ వస్తుందని.. ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడతానని కలలో కూడా అనుకోలేదు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకమైన పి.గన్నవరం నియోజకవర్గానికి తనను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. కలలో కూడా ఊహించని అవకాశం. సంతోషంగా ఉంది.18 మంది దళితులకు మొదటి జాబితాలోనే సీట్లు ఇచ్చి చంద్రబాబు తన గొప్పతనం చాటుకున్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం సామాన్యులకు ఇవ్వడం ఎంత గొప్ప విషయం. బడుగు బలహీన వర్గాలను ద్వేషించే జగన్మోహన్ రెడ్డిని ఓడించి 2024లో టీడీపీ, జనసేన జెండాను రెపరెపలాడిద్దాం. కాగా పొత్తు ధర్మంలో భాగంగా ఉమ్మడి అభ్యర్థి ఎవరైనప్పటికీ వారి విజయానికి కృషి చేస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ అన్నారు.



సామర్లకోటలో నిమ్మకాయల చినరాజప్పకు గజమాలతో అభినందన



(కాకినాడ - ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల రణక్షేత్రంలో ఉమ్మడి తూర్పు గోదావరిలో బరిలోకి దిగనున్న అభ్యర్థుల జాబితాను టీడీపీ,జనసేన పార్టీలు ప్రకటించాయి. కొంత కాలంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న జాబితాను ఎట్టకేలకు శనివారం ఉదయం అధికారికంగా వెల్లడించాయి.రకరకాల వడపోతలు, మదింపుల అనంతరం గెలుపుగుర్రాలను గుర్తించి సీట్లను ఖరారు చేశాయి.తొలివిడత జాబితాలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి మొత్తం 11 మంది అభ్యర్థులను ప్రకటించాయి. ఇందులో తొమ్మిది స్థానాల్లో టీడీపీ, రెండు చోట్ల జనసేన తమ అభ్యర్థుల పేర్లను వెల్లడించాయి. టీడీపీ ప్రకటించిన తొమ్మిది మంది అభ్యర్థుల్లో మండపేట, పెద్దాపురం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు వేగుళ్ల, చినరాజప్పకు టికెట్లు ఖరారు చేశారు.జగ్గంపేట,ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తిలో మార్పులేవీ లేకుండా ప్రస్తుత ఇన్‌చార్జులైన నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు సీట్లు ప్రకటించారు. తుని, రాజమహేంద్రవరం సిటీ, పి.గన్నవరం నియోజకవర్గాలకు పూర్తిగా కొత్త ముఖాలను సైకిల్ పార్టీ బరిలో దించింది.జనసేన ప్రకటించిన రెండు సీట్లలో రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ తొలిసారి పోటీ చేస్తున్నారు.ఇంకా 8 సీట్లలో అభ్యర్థుల ప్రకటన వాయిదా పడింది.రాజమహేంద్రవరం రూరల్ స్థానం దాదాపు టీడీపీకే ఖాయమైంది. రాజోలు నుంచి జనసేన పోటీ చేయనుంది.ఇంకా ఆరు సీట్లలో రంపచోడవరం మినహా మిగిలిన ఐదులో రెండు స్థానాల్లో జనసేన బరిలో దిగే అవకాశం ఉంది.

ఆచితూచి.. బేరీజు వేసి...

రాబోయే ఎన్నికల్లో వైసీపీ డబ్బు, మద్యం, అధికార బలంతో బరిలోకి దిగడానికి సన్నాహాలు చేసిన నేపథ్యంలో అధికార పార్టీని బలంగా ఢీకొని విజయబావుటా ఎగురవేసే సత్తా, సామర్థ్యం ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయడానికి టీడీపీ, జనసేన పార్టీలు సుదీర్ఘ కసరత్తు చేశాయి.దీనిలో భాగంగా ప్రకటించబోయే అభ్యర్థి శక్తిసామర్థ్యాలతో పాటు ప్రజామోదం ఉండేలా పలు జాగ్రత్తలు తీసుకున్నాయి. ఒకపక్క అధికార వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులను ఇప్పటికే ప్రకటించడంతో టీడీపీ కూటమిపై ఒత్తిడి పెరిగింది. అభ్యర్థులను ఇంకా ప్రకటించకపోవడంతో కొంత టెన్షన్ నెలకొంది. అయినా ఎక్కడా ఒత్తిడికి లోనవకుండా టీడీపీ తన అభ్యర్థులపై అన్నిరకాల మదింపులు చేసి గెలుపు గుర్రాలు అని నిర్ధారించుకుని ఎట్టకేలకు శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలి విడతలో 9 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇం దులో కాకినాడ పార్లమెంట్ పరిధిలో తుని, జగ్గంపేట, పెద్దాపురం సీట్లను, అమలాపురం పార్లమెంట్ స్థానం పరిధిలో ముమ్మిడివరం, పి.గన్నవరం, కొత్తపేట, మండపేట సీట్లను,రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానం పరిధిలో అనపర్తి, రాజమహేంద్రవరం సిటీ టికెట్లను టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఈ తొమ్మిది మందిలో మండపేట, పెద్దాపురం స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు,

- ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల వెల్లడి
- టీడీపీ 9, జనసేన 2
- ఇద్దరు సిట్టింగ్‌లు, నలుగురు మాజీలు
- బరిలో నలుగురు కొత్తవారు
- కాకినాడ రూరల్‌కు నానాజీ
- 8 సీట్లలో అభ్యర్థుల ప్రకటన వాయిదా
- సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు
- రాజమహేంద్రవరం రూరల్‌లో ఉత్కంఠ
- మరో 3 స్థానాల్లో జనసేన పోటీ

చినరాజప్పకు మళ్లీ సీట్లు ఖాయం చేశారు. జగ్గంపేట నుంచి జ్యోతుల నెహ్రూ, ముమ్మిడివరం దాట్ల సుబ్బరాజు, కొత్తపేట బండారు సత్యానందం, అనపర్తి నుంచి రామకృష్ణారెడ్డికి తిరిగి సీట్లు ఖరారయ్యాయి. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జులుగా కొనసాగుతున్న వీరంతా మాజీ ఎమ్మెల్యేలే. గత ఎన్నికల్లో వీరంతా పోటీ చేశారు. ఇదిలా ఉంటే తుని సీటును యనమల రామకృష్ణుడు తనయ దివ్యకు ఖాయం చేశారు. గతేడాది ఇక్కడున్న ఇన్‌చార్జి యనమల కృష్ణుడుని తప్పించి ఆ స్థానంలో దివ్యను దించారు. పూర్తిగా ఈమె రాజకీయాలకు కొత్త. తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. రాజమహేంద్రవరం సిటీ నుంచి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ స్థానంలో ఆమె భర్త ఆదిరెడ్డి వాసుకు సీటు ప్రకటించారు. ఈయన కూడా తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. గడచిన అయిదేళ్ల నుంచీ ఈయన నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. ఈ దఫా తానే బరిలోకి దిగుతానని అధిష్ఠానాన్ని ఒప్పించి సీటు తెచ్చుకున్నారు. అమలాపురం పార్లమెంట్ స్థానం పరిధిలో పి.గన్నవరం సీటును మహాసేన రాజేష్‌కు ఖరారు చేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన ఈయన రెండేళ్ల కిందట టీడీపీలో చేరారు. అధికార పార్టీ అక్రమాలు, అరాచకాలపై పోరాడతారనే పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో గన్నవరం సీటు కేటాయించారు. వాస్తవానికి ఈ నియోజకవర్గానికి గడచిన మూడేళ్లుగా పూర్తిస్థాయి ఇన్‌చార్జి లేరు. ఈ నేపథ్యంలో టికెట్లు ఆశిస్తోన్న నేతలతో పార్టీ సమన్వయ కమిటీని నియమించింది.అయితే వీరి బలాబలాలపై ఐవీఆర్ఎస్ విధానంలో టీడీపీ సర్వే చేపట్టింది. అందులో భాగంగానే రాజేష్‌కు సీటు ఖాయం చేసింది. అయితే టీడీపీ ఆశావహులు కొందరు రాజేష్‌కు టిక్కెట్ ఇవ్వడంపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో పక్క జనసేన ఇద్దరు అభ్యర్థులను ప్రకటిం చింది. కాకినాడ రూరల్ నుంచి అందరూ ఊహించినట్టుగానే పంతం నానాజీ పేరును పవన్ ప్రకటిం చారు. ఈ సీటు జనసేనకు ఇచ్చే ఉద్దేశంతో టీడీపీ కూడా ఇక్కడ ఆశావహులకు ముందే విషయాన్ని వెల్లడించి జనసేనకు సహకరించేలా కొన్నేళ్ల కిందటే సంసిద్ధులను చేసింది. రెండో సీటుకు రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ పేరును ఖరారు చేశారు. ఈ సీటు కూడా జనసేనకు ఇవ్వడానికి టీడీపీ ముందే సిద్ధమైంది.ఈ నేపథ్యంలో రాజానగరం నుంచి తాము పోటీచేస్తున్నట్టు ఇప్పటికే జనసేన ప్రకటించింది.ఒకరకంగా చెప్పాలంటే శనివారం ప్రకటించిన ఉమ్మడి జాబితా అందరికీ పూర్తి ఆమోదయోగ్యమనే చెప్పాలి. మరోపక్క టిక్కెట్ల వెల్లడి సమయంలో చంద్రబాబు మాట్లాడుతూ తొలి విడత లో ప్రకటించిన అభ్యర్థుల విషయంలో ఎప్పుడూ లేనంత భారీ కసరత్తు చేశామని, నియోజకవర్గాల్లో వేలాది మంది ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టి గెలుపు గుర్రాలుగా భావించాకే పేర్లను ప్రకటిస్తున్నామని వివరించారు.

త్వరలో ఆ సీట్లలోను...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 సీట్లకుగాను శనివారం 11 చోట్ల అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. ఇంకా ఎనిమిది స్థానాల్లో అభ్యర్థులు ఎవరనేది తేలాల్సి ఉంది. అయితే వీటిలో రాజోలు సీటు ఇప్పటికే జనసేనకు ఖాయమైంది. ఇక్కడి నుంచి అభ్యర్థి ఎవరనేది పవన్ కల్యాణ్ రెండు రోజుల్లో ప్రకటించనున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌కు టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జన సేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీ పడుతున్నారు.సీటు విషయంలో కొంత తర్జనభర్జన కొనసాగుతోంది. ప్రత్తిపాడు, పిఠాపురం, అమలాపురం, రామచంద్రపురం స్థానాల విషయంలో ఇరు పార్టీల సీట్ల సర్దుబాటు చర్చలు కొనసాగుతున్నాయి. వీటిలో రెండు చోట్ల పోటీ చేయాలని జనసేన భావిస్తున్నట్టు చెబుతున్నారు.ఇదే విషయమై పవన్ మాట్లాడుతూ జనసేన పోటీ చేసే స్థానాలపై రెండు రోజుల్లో ప్రకటన చేస్తామని పేర్కొన్నారు.త ద్వారా ఆ సీట్లు ఏవనేదానిపై స్పష్టత రానుంది.ఆ తర్వాత మిగిలిన సీట్లలో టీడీపీ అభ్యర్థుల పేర్లు ప్రకటించనున్నారు.కాకినాడ సిటీ, రంప చోడవరం సీట్లలో టీడీపీయే బరిలోకి దిగనుంది.

వైసీపీ గుండెల్లో రైళ్లు..

ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ సీట్లకు అభ్యర్థుల ఎంపికపై అధికార వైసీపీ ఆపసోపాలు పడుతోంది. ఇప్పటి వరకు ఐదు విడతల్లో జాబితాలు విడుదల చేసినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సగం సీట్లలో కూడా అభ్యర్థులను ప్రకటించలేకపోయింది. కానీ టీడీపీ, జనసేనలు కాస్త ఆలస్యమైనా ఒకేసారి సగానికిపైగా స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి స్పీడ్ పెంచాయి.దీంతో ఇప్పుడు వైసీపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన తర్వాత నియోజకవర్గాల్లో అలజడి రేగుతుందని భావించినా అదెక్కడా లేకపోవడంతో వైసీపీ కంగుతిన్నట్లయింది.

నాలుగు క్లియర్.. మూడు హైటెన్షన్

పెద్దాపురం, జగ్గంపేట, తుని స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు

కాకినాడ రూరల్ నుంచి జనసేన అభ్యర్థి

తీవ్ర ఉత్కంఠతను రేపుతున్న పిఠాపురం, ప్రత్తిపాడు, కాకినాడ సిటీ

సీట్ల సర్దుబాటు చర్చలతో హైటెన్షన్

కాకినాడ జిల్లాలో టీడీపీ, జనసేన కూటమి అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో నలుగురికి టిక్కెట్లు ఖరారయ్యాయి. వీరిలో ముగ్గురు టీడీపీ నుంచి ఉండగా, ఒకరు జనసేన అభ్యర్థి. ఇందులో పెద్దాపురం సిట్టింగ్ ఎమ్మెల్యే చినరాజప్ప కాగా, జగ్గంపేట నుంచి మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఉన్నారు. తుని నుంచి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య బరిలోకి దిగుతుండగా, కాకినాడ రూరల్ నుంచి ముందునుంచీ అనుకున్నట్టుగానే జనసేన అభ్యర్థి పంతం నానాజీకి టిక్కెట్టు ఖరారైంది. జగ్గంపేట నుంచి మినహా మిగిలిన మూడు చోట్ల నుంచి మిత్రపక్షాలైన టీడీపీ, జనసేనల నుంచి సానుకూల స్పందనే లభించింది. జగ్గంపేటలో మాత్రం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఇరుపార్టీల నాయకులు సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం. ఇక సామాజికవర్గాలపరంగా చూస్తే జనసేనతో కలిపి ప్రకటించిన నాలుగు సీట్లలో మూడు సీట్లు కాపు సామాజిక వర్గానికి దక్కగా, తుని నుంచి యాదవులకు దక్కింది. అయితే డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గానికి జిల్లాలోని ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచికి చెందిన ఎస్సీ కులానికి చెందిన మహాసేన రాజేష్‌కు టీడీపీ టిక్కెట్టు లభించడం మరో విశేషం. ఇక జిల్లాలో మరో మూడు సీట్లు కాకినాడ సిటీ, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అయితే టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా వీటిలో ఏదొక సీటు ఇవ్వాల్సి ఉంది. ముఖ్యంగా పిఠాపురం సీటు విషయంలో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. అలాగే కాకినాడ సిటీ, ప్రత్తిపాడు అభ్యర్థుల విషయంలోనూ ప్రతిష్ఠంభన కొనసాగుతుండడంతో ఆయా పార్టీల కేడర్‌లో ఊహాగానాలు సాగుతున్నాయి.



మాజీ ఎమ్మెల్యే పిల్లి దంపతులను కలిసిన పంతం నానాజీ

కాకినాడ రూరల్‌లో జనసేన జోష్

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 24: కాకినాడ రూరల్ నియోజకవర్గం జనసేన-టీడీపీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థిగా జనసేన రూరల్ ఇన్‌చార్జి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) పేరుని ప్రకటించడంతో జనసేనలో జోష్ పెరిగింది. ఆ పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. నానాజీకి టిక్కెట్ ప్రకటించిన వెంటనే గొడారిగుంటలోని నానాజీ నివాసం నుంచి పార్టీ కార్యకర్తలు బైక్‌ల ర్యాలీగా వలసపాకల గంగరాజునగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. టిక్కెట్ సాధించిన నానాజీని అభినందించేందుకు కాకినాడ రూరల్, కరప మండలాల నుంచి వేలాది మంది కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి, కేకు కోయించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణులు కార్యాలయం వద్ద మందుగుండు సామాన్లు కాల్చి ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ), టీడీపీ నాయకులు రాందేవు సీతయ్యదొర, దేవు వెంకన్న, బోళ్ల కృష్ణమోహన్, తాతపూడి రామకృష్ణ, మామిడాల వెంకటేష్, తాటికాయల వీరబాబు, పండు నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులను పంతం నానాజీ ప్రత్యేకంగా కలసి తనకు సహకరించాలని కోరారు.

హ్యాట్రిక్ సాధించేందుకు చినరాజప్ప రెడీ

సామర్లకోట, ఫిబ్రవరి 24: పెద్దాపురం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ గెలుపు సాధించేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సిద్ధమయ్యారు. తొలి జాబితాలో ఆయన పేరు ఖరారు కావడంతో ఇక్కడ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. నియోజకవర్గానికి చేరుకున్న రాజప్పకు పూలమాలలతో ముంచెత్తారు. 2014, 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆయన ఈసారీ భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమంటూ టీడీపీ నాయకులు స్పష్టంచేస్తున్నారు.

జ్యోతుల నెహ్రూ మళ్లీ బరిలోకి..

మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ టీడీపీ అభ్యర్థిగా మరోసారి బరిలోకి దిగనున్నారు. గత ఎన్నికల్లో త్రిముఖ పోటీతో ఓటమి చెందిన ఆయన ఈసారి కూటమి అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఊహించినట్టుగానే తొలి జాబితాలోనే నెహ్రూ పేరు ప్రకటించడంతో టీడీపీ శ్రేణుల్లో ఆనందం నెలకొంది. జనసేన ఇన్‌చార్జి నుంచి కొంత ఇబ్బంది ఎదురైనా పార్టీ ముఖ్యుల జోక్యంతో అంతా సర్దుకుపోతుందనే భావనతో ఇరు పార్టీల శ్రేణులు ఉన్నాయి.

బరిలో యనమల కుమార్తె దివ్య

తుని రూరల్, ఫిబ్రవరి 24: తొలి జాబితాలోనే తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్యకు చోటు దక్కింది. ఈమె యనమల రామకృష్ణుడు కుమార్తె కావడంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

27 నుంచి టెట్-24 పరీక్షలు

- జిల్లాలో 5 ఆన్‌లైన్ కేంద్రాల్లో నిర్వహణ
- పరీక్షలకు హాజరుకానున్న 5,880 మంది

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 24: ఏపీ పాఠశాల విద్య కమీషనర్ ఆదేశాల మేరకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)ను ఈనెల 27 నుంచి మార్చి 6 వరకూ నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. ఈ పరీక్షలను కాకినాడలోని అచ్చుతాపురంలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలోని 3 కేంద్రాల్లోనూ, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న ఒక కేంద్రంలోనూ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ టెట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 5880 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షల పర్యవేక్షణకుగానూ ఐదుగురు అధికారులను, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి లేటెస్ట్ ఫొటో, గుర్తింపుకార్డుతో హాజరుకావాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.



కాకినాడ సముద్ర తీరంలోని ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం దృశ్యం

రేపు ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం ప్రారంభం

- కాకినాడ బీచ్‌లో ఇక ప్రత్యేక ఆకర్షణ
- రూ.9.03 కోట్ల వ్యయంతో ఏర్పాటు

కార్పొరేషన్(కాకినాడ),ఫిబ్రవరి24: కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడ) ఆధ్వర్యంలో 2020లో రూ.9.03 కోట్లతో ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేశారు. అయితే అనేక అవాంతరాల నడుమ ఆ ప్రాజెక్టు నత్తనడకన సాగింది. ఎట్టకేలకు పనులన్నీ పూర్తికావడంతో ప్రజలకు అందుబాటులోకి వచ్చేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 26న సోమవారం ఈ ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియాన్ని ప్రారంభించేందుకు ముహూర్తం నిర్ణయించారు. కాకినాడలో ఇప్పటివరకు నగరంలో పార్కులు తప్ప సందర్శించేందుకు సరైన సౌకర్యాలు లేక నగర ప్రజలు ఎంతో నిరాశతో ఉన్నారు. ఇటువంటి తరుణంలో కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్ ప్రాంతంలో ఈ ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం ఏర్పాటు చేయడంతో అదొక సందర్శన ప్రాంతంగా ఇక నిలవనుంది. అలాగే నగర ప్రజలకు కూడా కొత్త అనుభూతినివ్వనుంది. మ్యూజియం పక్కనే సముద్రం కూడా ఉండడంతో జిల్లాలోని అనేక గ్రామాల ప్రజలకు ఇది ఒక సందర్శన ప్రాంతంగా మారనుంది. మూడెకరాల స్థలంలో పచ్చదనంతో నిండిన పార్కుతోపాటు టీయూ 142ఎం ఎయిర్ క్రాఫ్ట్‌ను చెన్నై అరకోణం నేవీ నుంచి తీసుకువచ్చారు. అలాగే హెచ్‌పీటీ 32 ట్రైన్ ఎయిర్‌క్రాఫ్ట్ కూడా ఏర్పాటుచేస్తున్నారు. టీయూ 142ఎం ఎయిర్‌క్రాఫ్ట్ లోపల భాగంలో కూడా సందర్శించేందుకు వీలుగా మ్యూజియం ఏర్పాటుచేశారు. పిల్లలు ఆడుకునేందుకు అధునాతన సౌకర్యాలతో గేమింగ్‌జోన్ కల్పించారు. సందర్శకులు సేదతీరేందుకు ఆహ్లాదకరమైన పార్కును పచ్చదనంతో సుందరీకరించారు. ఈట్‌స్ట్రీట్ కూడా ఏర్పాటుచేస్తున్నారు. కరెంటు ఆదా చేసేందుకు సోలార్ సిస్టం వినియోగిస్తున్నారు. మ్యూజియం నిర్వహణ కోసం సందర్శకుల నుంచి కనీస టికెట్ ధరను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. అయితే ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఎంత ధర ఉండాలనేది యోచిస్తున్నారు. సోమవారం దీన్ని ప్రారంభించేందుకు పూర్తి ఏర్పాట్లు చేసినట్టు కౌడ అధికారులు తెలిపారు.

సముద్రస్నానానికి తరలివచ్చిన భక్తులు



వైభవంగా చక్రస్నానం

చక్రపెరుమాళ్ స్వామికి ప్రత్యేక పూజలు

అంతర్వేది తీరానికి పోటెత్తిన భక్తజనం



పెరుమాళ్‌స్వామికి చక్రస్నానం

7లో

టీడీపీ, జనసేన అభ్యర్థుల బయోడేటాలు

ఉమ్మడి తూర్పుగోదావరిలో బరిలోకి దిగనున్న అభ్యర్థుల జాబితాను టీడీపీ, జనసేన పార్టీలు ప్రకటించాయి. జాబితాను శనివారం ఉదయం అధికారికంగా వెల్లడించాయి. తొలివిడత జాబితాలో ఉమ్మడి తూ.గో. జిల్లాకు సంబంధించి మొత్తం 11మంది అభ్యర్థుల బయోడేటా వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

నియోజకవర్గం : పెద్దాపురం

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : నిమ్మకాయల చినరాజప్ప
వయస్సు : 70
విద్యార్హతలు : ఎం.ఏ
తల్లిదండ్రులు : వెంకట రంగయ్య, కొండమ్మ
భార్య : అనురాధ
కుమారుడు : రంగనాగ్
కుమార్తె : కల్యాణి
స్వగ్రామం : పెదగాడవల్లి, ఉప్పలగుప్తం మండలం

రాజకీయ నేపథ్యం: నిమ్మకాయల చినరాజప్ప 2014 ఎన్నికల్లో పెద్దాపురం నియోజక వర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున గెలుపొంది రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగానూ, హోంమంత్రిగానూ 2019 వరకూ బాధ్యతలు నిర్వహించారు. తదుపరి 2019లో జరిగిన ఎన్నికలలో కూడా రెండవ దఫా తిరిగి పెద్దాపురం నియోజకవర్గం నుంచి అనూహ్యంగా గెలుపొందారు. అంతకుముందు 2007-2013 నాటి కాలంలో శాసనమండలి సభ్యుడిగా ఉన్నారు. 2004-2006 మినహా 1989 నుంచి 2014 వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిలో కొనసాగారు. 1982లో నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలోకి చేరి క్రియాశీలక సభ్యునిగా కొనసాగారు. ఎన్టీఆర్ పార్టీ ప్రకటించినపుడు చినరాజప్ప ఎన్టీఆర్ సమక్షంలోనే ఉన్నారు. 1986లో తూర్పుగోదావరి జిల్లా పార్టీ ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1987లో ఉప్పలగుప్తం మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1995లో రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్‌గా, 2001లో కెనరా బ్యాంక్ డైరక్టర్‌గా వివిధ పదవులు అధిరోహించారు.

నియోజకవర్గం : జగ్గంపేట

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : జ్యోతుల నెహ్రూ
వయస్సు : 71
విద్యార్హతలు : ఎంఏ (పొలిటికల్ సైన్స్)
తల్లిదండ్రులు : జ్యోతుల నాగేశ్వరరావు, సుబ్బయ్యమ్మ
భార్య పేరు : మణి,
కుమారుడు : జ్యోతుల నవీన్, కోడలు లక్ష్మీదేవి
కుమార్తె : తోట సునీత, అల్లుడు : తోట సర్వారాయుడు

రాజకీయ నేపథ్యం: తొలుత 1981లో రంగంపేట సొసైటీకి పోటీచేసి ఓటమి చెందారు. అనంతరం మామిడాడ సొసైటీ చైర్మన్‌గా విజయం సాధించారు. జగ్గంపేటలో 1991లో టీడీపీ తరపున ఉపఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. అనంతరం జగ్గంపేట నుంచే 1994, 1999 సాధారణ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటనరసింహంపై ఓడిపోయారు. తర్వాత 2009లో ప్రజారాజ్యం పార్టీ తరుపున పోటీచేసి ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీచేసి ఓడిపోయారు.

నియోజకవర్గం : తుని

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : యనమల దివ్య
వయస్సు : 39
విద్యార్హతలు : బీటెక్, ఎంబీఏ ఫైనాన్స్(యూకే)
తండ్రి : యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి, ప్రతిపక్ష నేత,
భర్త : గోపీనాథ్ (ఐఏఎస్)
కుమారుడు : రవి
కుమార్తె : జ్యోష్న
స్వగ్రామం : ఏవీ నగరం

రాజకీయ నేపథ్యం: తన తండ్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ప్రోత్సాహంతో రాజకీ యాల్లోకి ప్రవేశించారు. ప్రస్తుతం తుని నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

నియోజకవర్గం : అనపర్తి

పేరు : నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
విద్యార్హతలు : బీఈ సివిల్ ఇంజనీర్
వయస్సు : 58
తల్లిదండ్రులు : నల్లమిల్లి మూలారెడ్డి మాజీ ఎమ్మెల్యే, సత్యవతి దంపతులు
భార్య : నల్లమిల్లి మహాలక్ష్మి
కుమారుడు : నల్లమిల్లి మనోజ్‌రెడ్డి
కుమార్తె : నల్లమిల్లి సనాతిని
నివాసం : రామవరం, అనపర్తి మండలం

రాజకీయనేపథ్యం : 2012 నుంచి అనపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతలు. 2014 ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి గెలుపు. 2019 ఎమ్మెల్యేగా ఓటమి. అంతకు ముందు రామకృష్ణారెడ్డి తండ్రి నల్లమిల్లి మూలారెడ్డి 1983 నుంచి వరుసగా ఏడు పర్యాయాలు టీడీపీ అభ్యర్థిగా పోటీ నాలుగు సార్లు విజయం, మూడుసార్లు ఓటమి.

నియోజకవర్గం : ముమ్మిడివరం

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)
తల్లిదండ్రులు : వెంకటసత్యనారాయణరాజు, నారాయణమ్మ
వయస్సు : 51
విద్యార్హతలు : ఇంటర్మీడియట్ (బైపీ)
భార్య : పార్వతి
కుమార్తెలు : స్నేహిత, శ్రావ్య

రాజకీయ నేపథ్యం : 1995లో టీడీపీలో చేరారు. 2004 సంవత్సరంలో మురమళ్ల జడ్పీ హైస్కూలు విద్యాకమిటీ చైర్మన్‌గాను, 2005 నుంచి 2013 పీఏసీఎస్ అధ్యక్షుడుగాను పనిచేశారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నడింపల్లి శ్రీనివాసరావు ఓటమి చెందడం, ఆ తరువాత ఆయన మృతిచెందడంతో సుబ్బరాజు టీడీపీ బాధ్యతను భుజాన వేసుకున్నారు. 2014లో 29,538 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 5547 ఓట్లతో వైసీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌పై ఓటమి చెందారు.

నియోజకవర్గం : కొత్తపేట

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : బండారు సత్యానందరావు
తల్లిదండ్రులు : దివంగత బుల్లిసత్యం, చంద్రావతి
వయస్సు : 59
స్వగ్రామం : వాడపాలెం, కొత్తపేట మండలం
కులం : కాపు
విద్యార్హత : బీకాం
భార్య : కమలారాణి
పిల్లలు : సందీప్, సంజీవ్, రమ్య

రాజకీయ నేపథ్యం : 1982లో నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించి పలు పార్టీ పదవులు అలకరించారు. 1989లో శాసనసభ ఎన్నికలకు టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. 1994, 1999లలో టీడీపీ శాసనసభ్యుడిగా విజయం సాధించారు. 2004లో స్వల్పతేడాతో ఓటమి చెందారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అలాగే 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో టీడీపీ తరుపు పోటీ చేసి ఓటమి చెందారు. 2024లో 8వ సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. శాసనసభ్యుడిగానే కాకుండా అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యునిగా, పీఆర్పీ శాసనసభ ఉపనాయకుడిగా పనిచేశారు.

నియోజకవర్గం : పి.గన్నవరం

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : సరిపెల్ల రాజేష్‌కుమార్ (మహాసేన రాజేష్)
వయస్సు : 43
విద్యార్హతలు : బి.కాం
తండ్రి పేరు : సరిపెల్ల సాధుసుందర్‌సింగ్
తల్లి పేరు : స్వర్ణలక్ష్మి (మాజీ ఉపసర్పంచ్ ఉత్తరకంచి)
భార్య పేరు : హరిక,
పిల్లలు : సంజనషోబిత, మధుహాషిని
నివాసం : ఉత్తరకంచి, ప్రత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా

రాజకీయ నేపథ్యం: 2017లో మహాసేన అనే సంస్థను స్థాపించి అనంతరం 2018లో జగన్మోహనరెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. అలాగే వైసీపీలో జరిగిన పలు పరిణామాలతో కొద్దికాలానికే బయటకు వచ్చేశారు. 2022లో సామర్లకోటలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. మూడేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై మహాసేన సోషల్ మీడియా వేదికగా పోరు సాగిస్తున్నారు.

నియోజకవర్గం : మండపేట

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : వేగుళ్ల జోగేశ్వరరావు
వయస్సు : 69
విద్యార్హతలు : బి.కాం
తల్లిదండ్రులు : సర్దార్ వేగుళ్ల వీర్రాజు, మాణిక్యాంబ
భార్య పేరు : విజయలక్ష్మి
కుమార్తెలు : మణిమంజరి, సాయిసుమన
నివాసం : పాటిమీద, కేపీ రోడ్డు, మండపేట

రాజకీయ నేపథ్యం : 1989లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. 1999లో టీడీపీలో చేరారు. తొలిసారిగా మండపేట మున్సిపల్ చైర్మన్‌గా టీడీపీ తరపున పోటీచేసి 2000వ సంవత్సరంలో విజయం సాధించారు. 2004లో ఆలమూరు అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరపున స్వల్ప మెజార్టీతో ఓటమిపాలయ్యారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆలమూరు నుంచి విడిపోయి మండపేట నియోజకవర్గం 2009లో ఏర్పడింది. మండపేట అసెంబ్లీ నుంచి టీడీపీ తరపున 2009, 2014, 2019లలో మూడుసార్లు వరుసగా టీడీపీ తరపున పోటీచేసి గెలుపొందారు. ఇప్పుడు మరోసారి 2024లో జరిగే ఎన్నికల్లో నాల్గవసారి పోటీకి సై అంటున్నారు.

నియోజకవర్గం : కాకినాడ రూరల్

పార్టీ : జనసేన
అభ్యర్థి పేరు : పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)
తండ్రి : పంతం సుబ్బారావు,
వయస్సు : 62
విద్యార్హతలు : డిగ్రీ
కులం : కాపు సామాజికవర్గం
భార్య పేరు : అరుణ, పదో తరగతి
కుమారుడు పేరు : పంతం సందీప్, బీటెక్, ఎంబీఏ
వ్యాపారం : రియల్ ఎస్టేట్
స్వగ్రామం : గెద్దనాపల్లి, కిర్లంపూడి మండలం
నివాసం : గొడారిగుంట, కాకినాడ

రాజకీయ నేపథ్యం : కాంగ్రెస్ పార్టీలో కాకినాడ సిటీ అధ్యక్షుడుగా, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా, ఏపీసీసీ కార్యదర్శిగా పనిచేశారు. సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కాకినాడ సిటీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. జనసేనలో 2018లో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులుగా, కాకినాడ రూరల్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాకినాడ రూరల్ నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీచేసి 39,247 ఓట్లు సాధించారు.

నియోజకవర్గం : రాజమహేంద్రవరం సిటీ

పార్టీ : తెలుగుదేశం
అభ్యర్థి పేరు : ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)
తండ్రి పేరు : ఆదిరెడ్డి అప్పారావు మాజీ ఎమ్మెల్సీ,
తల్లి పేరు : వీరాఘవమ్మ, రాజమహేంద్రవరం మాజీ మేయర్
భార్య పేరు : ఆదిరెడ్డి భవాని, ప్రస్తుత సిటీ ఎమ్మెల్యే
కుమారుడు : ఆదిరెడ్డి జయేష్‌నాయుడు (8వ తరగతి)
విద్యార్హతలు : బీఈ (మద్రాస్ యూనివర్సిటీ)

రాజకీయ నేపథ్యం : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, రాజమహేంద్రవరం నియోజకవర్గ ఇన్‌చార్జి. రాజమహేంద్రవరం నగరం కేంద్రంగా పార్టీ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన మహానాడు, చంద్రబాబు అరెస్టు సమయంలో జరిగిన ఆందోళనలకు కీలకపాత్ర వహించారు.

సామాజిక సేవలు : భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏడాదికి వంద మంది పేద విద్యార్థులకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం చేయడం, పేదలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించడం, పేద క్రీడాకారులకు క్రీడా పరికరాల కోసం ఆర్థిక సాయం, మొబైల్ అన్నా క్యాంటీన్లు నగరంలో పలుచోట్ల ఏర్పాటుచేసి పేదలకు భోజనాలు పెట్టడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గం : రాజానగరం

పేరు : బత్తుల బలరామకృష్ణ
తండ్రిపేరు : బత్తుల గంగారావు
స్వస్థలం : గాదరాడ, కోరుకొండ మండలం
కులం : ఓసీ(కాపు)
వయసు : 49
చదువు : 10వ తరగతి , బి.కాం (డిస్కంటిన్యూ)
భాషలు : తెలుగు, ఇంగ్లీషు
భార్య : బత్తుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ
కుమార్తెలు : బత్తుల ప్రత్యూషదేవి, బత్తుల వందనాంబిక వివాహిత, వ్యాపారం
అల్లుడు : తోట పవన్‌కుమార్, వ్యాపారవేత్త
కుమార్తె : బత్తుల వందనాంబిక(బీబీఏ విద్యార్థి, భూస్వామి)

రాజకీయ నేపథ్యం: రాజానగరం జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ రాజకీయాలకు కొత్త. సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వహిస్తూ వివిధ వ్యాపారాల్లో ఉన్నారు. కోరుకొండ మండలం గాదరాడకు చెందిన ఆయన ఒకే ప్రాంగణంలో 54 దేవాలయాలను నిర్మించి ఆధ్యాత్మికవేత్తగా పేరు తెచ్చుకున్నారు. ఓంశక్తి పీఠం నిర్వహిస్తున్నారు. గతఎన్ని కలలో వైసీపీకి పనిచేశారు. తర్వాత ఆయన సతీమణి వైసీపీ తరఫున ఎంపీటీసీగా గెలిచారు. కానీ తర్వాత వైసీపీ నేతలతో విభేదాలవల్ల జనసేనలో చేరి టిక్కెట్టు తెచ్చుకున్నారు.

రాజమహేంద్రవరంలో సీఎంఆర్ జ్యూయలరీ షోరూం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీఘాకోళపు తదితరులు

రాజమహేంద్రవరం, కల్చరల్, ఫిబ్రవరి 24: సీఎం ఆర్ షోరూంలో నూరుశాతం బీఐఎస్ హాల్‌మార్క్ ఆభరణాలు లభిస్తాయని ప్రముఖ కాంట్రాక్టర్, బిల్డర్ శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అతిపెద్ద గ్రూప్ సీఎంఆర్ టెక్స్ టైల్స్ అండ్ జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి తమ ఎక్స్‌క్లూజివ్ జ్యూయలరీ షోరూంను శనివారం రాజమహేంద్రవరం కందకం రోడ్‌లో ప్రారంభించారు. షోరూం ప్రారంభోత్సవ స్పెషల్ ఆఫర్‌గా గ్రాము బంగారంపై రూ.250 వరకు తగ్గింపు మార్చి 10వ తేదీ వరకు ఉంటుందని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ తెలిపారు. సులభతరమైన బంగారం కొనుగోలు పథకం ఉందన్నారు. వ్యక్తిగత ఆర్డర్‌పై కస్టమర్స్ అభిరుచులకు అనుగుణంగా జ్యూయలరీ తయారు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కంటిపూడి సర్వారాయుడు, ఆర్.సుబ్బరాజు, డీవీబీ.రాజు, చందన నాగేశ్వర్, చెరుకూరి వీర్రాజు, అక్కిన మునికోటేశ్వరరావు, చెరుకూరి కృష్ణాజీ, డాక్టర్ పద్మజ, కె.ప్రభాకర్ షోరూమ్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు.

ఆహ్లాదంగా భీమేశ్వరుని వసంతోత్సవం


సప్తగోదావరిలో త్రిశూల శ్రీచక్రస్నానంలో పాల్గొన్న భక్తులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 24: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపు రం మండలం ద్రాక్షారామ భీమేశ్వరుడి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి వసంతోత్సవం ఆనందోత్సాహంతో జరిగింది. అదేవిధంగా త్రిశూ ల, శ్రీచక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం వేగాయమ్మపేట ఆస్థాన మండపంవద్ద నుంచి కల్యాణమూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామివార్లను రథంపై ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం నిత్యపూజ, అర్చనలు జరిగాయి. తదుపరి మండపారాధన, నాకబలి పూజలు ఆగమ పండితులు దేవులపల్లి ఫణి రామకృష్ణ నిర్వహించారు. గ్రామోత్సవం అనంత రం వసంతోత్సవం జరిగింది. కల్యాణమూర్తులైన స్వామి,అమ్మవార్లకు వసంతాలు చల్లారు. అనంతరం అర్చక స్వాములు కల్యాణమూర్తులను చేతపట్టి వసంతాలు జల్లుకున్నారు. మంగళవాయిద్యాలకు అనుగుణంగా లయ బద్ధంగా నృత్యంచేస్తూ దండాడింపు, వసంతోత్సవం ఆహ్లాదంగా జరిగాయి. తదుపరి సప్తగోదావరినదిలో త్రిశూల, శ్రీచక్రస్నానం అర్చకస్వాములు జరిపారు. అధికసంఖ్యలో భక్తులు త్రిశూల, శ్రీచక్రస్నానం కార్యక్రమంలో పా ల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.టి.వి.సత్యనారాయణ, అర్చకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా నరసన్న చక్రస్నానం

● చక్రపెరుమాళ్ స్వామికి ప్రత్యేక పూజలు, ● పోటెత్తిన భక్తజనసంద్రం



భక్తుల మధ్య చక్రపెరుమాళ్‌కు చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, ఫిబ్రవరి 24: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి పురస్కరించుకుని శనివారం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం 7గంటలకు ఆలయంవద్ద నుంచి అలంకార మండపంలో అర్చకుల పూజలందుకున్న స్వామివారు రుద్రరాజు బంగారమ్మ బహూకరించిన గరుడపుష్పక వాహనంపై గ్రామపురవీధుల్లో ఊరేగుతూ భక్తుల నృసింహనామ శరణాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పల్లకీలో సుదర్శన చక్రధారుడైన పెరుమాళ్ స్వామిని మంగళవాయిద్యాల నడుమ సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. అక్కడ స్వామికి, చక్రపెరుమాళ్ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి జగన్నాథాచార్యులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితులు చింతా వేంకటశాస్త్రి, పేరూరు ఉద్దండ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫ్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజా బహదూర్, ఆలయ సహాయకమిషనర్ వి.సత్యనారాయణ, వలవల రాంబాబు, తహశీల్దార్ రమాకుమారి, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, పోతురాజు శ్రీవేంకటకృష్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, డీఎస్పీ రమణ, ఎస్‌ఐ ఎస్.రాము, వాహనకారులు, భక్తులు తదితరులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తొలుత పేరూరు ఉద్దండ పండితుల శిరస్సుపై శ్రీ చక్రపెరుమాళ్‌ను ఉంచి సముద్ర స్నానం చేశారు. స్వామితో పాటు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు, అగ్నికుల క్షత్రియులు పున్నమి స్నానాలు ఆచరించారు. మాఘ పౌర్ణమి కావడంతో సముద్ర తీరమంతా భక్తులతో కళకళలాడింది. జల్లుస్నానం రద్దు చేయడంతో వార్షికస్నానాలు చక్రపెరుమాళ్‌తో సముద్రంలోనే స్నానాలు ఆచరించారు. అనంతరం పూజలు అందుకున్న స్వామి, చక్రపెరుమాళ్‌ను వసంత మండపానికి అర్చకులు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్వామికి నైవేద్యాలు సమర్పించి భక్తులకు ప్రసాదం పంచారు. రాత్రి అర్చకులు ధ్వజావరోహణ నిర్వహించారు.

నేడు స్వామివారి తెప్పోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 24: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణో త్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, తిరువా రాధన, బాలభోగం, సాయంత్రం 5గంటలకు అప్పనపల్లి వాస్తవ్యు లు దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యే శ్వరరావు వారిచే నిర్మితమైన పుష్పకవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగనుంది. సాయంత్రం 6 గంటలకు చివరి ఘట్టమైన శ్రీస్వామివారి తెప్పోత్సవం గ్రామచెరువులో మిరుమి ట్లుగొలిపే విద్యుత్ దీపాలంకరణలతో చేసిన హంసవాహనంపై బ్రాహ్మండమైన బాణాసంచా కాల్పులతో వెంప వాస్తవ్యులు గొట్టుముక్కల భీమరాజు సహకా రంతో తెప్పోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు తిరుమంజనములు, దర్పణసేవ, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోల విన్నపం, తీర్థగోష్ఠి, శ్రీస్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఘనంగా అంతర్‌జిల్లాల

ఖోఖో పోటీలు ప్రారంభం


వివిధ జిల్లాల ఖోఖో క్రీడాకారుల కవాతు ప్రదర్శన

సామర్లకోట, ఫిబ్రవరి 24: కాకినాడజిల్లా సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం సాయంత్రం 56వ ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల సీనియర్స్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహభరితమైన వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి ఖోఖో క్రీడాకారులతో బాటూ ఉద్యోగుల సంఘం తరపున ఒకటి చొప్పున మొత్తం 14 జిల్లాల నుంచి 28 జట్లు వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఖోఖో సంఘం ఆద్వర్యంలో శనివారం నుంచి 3 రోజుల పాటు పగలు, ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రాత్రి సమయాలలోనూ ఈ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ అధ్యక్ష, కార్యదర్శులు ఊబా జాన్ మోజెస్, కె.పట్టాభిరామంలు చెప్పారు. ఈపోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షులు టీఎస్‌ఆర్‌కె ప్రసాదరావు, పోతుల సాయిబాబులతో బాటూ పెద్దాపురం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర లేబర్ సెల్ నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జీఅరుణ, పీఈటీ యార్లగడ్డ బంగార్రాజు, ఎం.వెంకటేశ్వర్లు, ఎండీపీ. ప్రసాద్, తదితర కౌన్సిలర్లు, వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రారంభ వేడుకలలో భాగంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఖోఖో క్రీడాకారులతో చేసిన పతాక వందనను స్వీకరించారు.


హోరాహోరీగా సాగుతున్న ఖోఖో పోటీలు

భక్తజనసంద్రంగా సత్యదేవుడి సన్నిధి

● 7311 వ్రతాలు, రూ.70 లక్షల ఆదాయం


సత్యదేవుడి సన్నిధిలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, ఫిబ్రవరి 24: సత్యదేవుడి సన్నిధి శనివారం మాఘపౌర్ణమి పర్వదినం సందర్భంగా అశేష భక్తజనంతో పోటెత్తింది. శుక్రవారం రాత్రికే రత్నగిరికి చేరుకున్న భక్తులకు సౌకర్యవంతంగా ఉండేవిధంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండుగంటల నుంచి వ్రతాలు మూడుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. శనివారం ఒక్కరోజు 7311 వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.70లక్షల ఆదాయం సమకూరింది. రద్దీ నేపథ్యంలో అంత్రాలయ ప్రదక్షిణ దర్శనాలు నిలుపుదల చేశారు. ఎక్కడికక్కడ క్యూలైన్‌లలో భక్తులకు మంచినీటి సదుపాయం కల్పించారు. ఎండలు మండుతుండడంతో షామియానాలు పూర్తిస్థాయిలో లేక భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఈవో రామచంద్రమోహన్ సమీక్షించారు.

జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి పాఠంశెట్టి నిరసన


స్పృహతప్పి పడిపోయిన పాఠంశెట్టి

గోకవరం/ జగ్గంపేట, ఫిబ్రవరి 24: టీడీపీ జనసేన ఉమ్మడి జాబితాలో జగ్గంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే సీటును టీడీపీ జ్యోతుల నెహ్రూకు కేటాయించడంతో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర మనస్తాపానికి గురయ్యారు. తాను సామాన్యుడిగా పుట్టినందుకే సీటు నిరాకరణకు గుర య్యానని అన్నారు. తన చావుతో ఎమ్మెల్యే సీటు ఆశించే సామాన్య అభ్యర్థులకు కనువిప్పు కలగాలన్నారు. ఆయన తీసుకున్న నిర్ణయంలో భాగంగా జగ్గంపేట మండలం గూనాడ నుంచి కార్యకర్తలతో పాదయాత్ర చేసుకుంటూ గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో బలవన్మరణానికి పాల్పడతానంటూ తన భార్యతో కలిసి బయలుదేరారు. నా భార్య ఇష్టదేవత దుర్గమ్మ గ్రామంలో ఉండడంతో అక్కడ తనువు చాలిస్తానన్నారు. సూర్య చంద్ర తీసుకున్న నిర్ణయం చట్టవ్యతిరేకమంటూ పోలీసులు ఆయన పాదయాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆయన పాదయాత్ర కొనసాగిస్తూ గోకవరం మండలం పెంటపల్లి వరకూ చేరుకున్నారు. అక్కడ ఆయన పాదయాత్ర అడ్డుకునేందుకు పోలీసులుచుట్టుముట్టారు. దీంతో ఆయన పక్కదారి గుండా అచ్యుతాపురం చేరేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో పోలీసులు.. ఆయనకు మధ్య జరిగిన పెనుగు లాటలో సూర్యచంద్ర స్పృహతప్పి పడిపోయారు. కార్యకర్తలు సపరిచర్యలు చేసిన కొద్దిసేపటికే మేల్కొని మాట్లాడారు. పవన్ కల్యాణ్ తన దేవుడంటూ కొనియాడారు. ఆయన తీసుకున్న నిర్ణయాన్ని శిరసా వహిస్తానన్నారు. కానీ 2019నుంచి తాను ప్రజల్లో తిరుగుతూ జనసేన పార్టీని ఎంతో బలోపేతం చేశాన న్నారు. కానీ సీటు నిరాకరణకు గురవడంతో తన ఆశయం నీరుగారిపోయిందన్నారు. అందుకే నా అంతిమ ఆమరణ దీక్షకు పూనుకోవడం జరిగిందన్నారు. పాదయాత్ర నేపథ్యంలో సుమారు 100 పోలీసులు పాదయాత్ర వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, ఫిబ్రవరి 24: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,66,460, అన్నదాన విరాళాలు రూ.1,03,550, కేశఖండన ద్వారా రూ.7,240, తులాభారం రూ.750 వెరసి రూ.4,78,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 20 వేలమంది స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని చెప్పారు.

నెర్రలు తీసిన దాళ్వా వరిపొలాల పరిశీలన

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట, ఫిబ్రవరి 24: సామర్లకోట మండలం వెంకటకృష్ణారాయపురం తదితర గ్రామాల్లో సాగునీరందక దాళ్వా వరిపొలాలు నెర్రలు తీసిన దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, వ్యవసాయా అధికారులను పొలాలు సందర్శించి నివేదికలు అందజేయాలని ఆదేశించడమే గాక నీటి తడులు సత్వరం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో శనివారం సాయంత్రం వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు రైతు భరోసా కేంద్రాల వీఏఏలు, రైతులతో కలిసి పరిశీలించారు. నీటి తడులు లేక వరి పొలాలు నెర్రలు తీసిన విషయం వాస్తవమేనని నిర్ధారించారు. కాగా గోదావరి కాలువలో నీటి విడుదలలు మరింత పెంచేలా చర్యలు తీసుకోవాల్సిఉందని, రైతులు ఫిర్యాదుల మేరకు వంతులవారీ నీటి వినియోగాన్ని 15రోజుల నుంచి వారం రోజులకు తగ్గించాలన్న ప్రతిపాదనను జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు.

యర్రంపాలెంలో అధికారుల పరిశీలన

గండేపల్లి, ఫిబ్రవరి 24: మండలంలో యర్రంపాలెం గ్రామం పక్కన ఉన్న రైసు మిల్లు నుంచి వచ్చే పొల్యూషన్ దుమ్ము, ఊకతో గ్రామస్తులు దగ్గు, ఆయాసం వంటి వ్యాధులకు గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించడం జరిగింది. ఈ కథనంపై స్పందించిన పొల్యూషన్ ఈఈ సందీప్‌రెడ్డి శనివారం గ్రామానికి విచ్చేసి డెస్ట్‌మోనటరింగ్ మిషన్‌తో పరిశీలించారు. దుమ్ము, దూగరతో చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వారికి వివరించారు. పొల్యూషన్ గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బ్యాంక్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 24: ఉత్తరకంచి బ్యాంక్ చోరీ కేసులో మహారాష్ట్రకు చెందిన ఇద్దరిని శనివారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 7న మండలంలోని ఉత్తరకంచి స్టేట్ బ్యాంక్‌లో దొంగలు రూ.1.43కోట్ల విలువ చేసే బంగారం, రూ.25లక్షల నగదు అపహరించుకుపోయారు. సామర్లకోటకోట బజార్ ప్రాంతంలో 10రోజుల పాటు ఇల్లు అద్దెకు తీసుకుని ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంక్ చోరీకి నిందితులు రెక్కీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో గాలింపులు చేపట్టారు. మహారాష్ట్రలోని బొల్‌దాన్ జి ల్లాకు చెందిన అక్షయ గజానా అంబోర్, సంగీత్ మిలాన్ గైక్వాడ్‌లను శనివారం అరెస్ట్ చేసినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో స్థానిక సీఐ ఎం.శేఖర్‌బాబు పర్యవేక్షణలో ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొవ్వాడలో ప్రోటోకాల్ వివాదం

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 24: కాకినాడ రూరల్ మండలం కొవ్వాడలో రూ.75లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామసచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్‌ను రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శనివారం ప్రారంభించారు. అయితే గ్రామ సర్పంచ్ కోటిపల్లి ఉమ ప్రారంభోత్సవానికి హాజరుకాలేదు. సర్పంచ్ హాజరుకాకపోయినా ఎమ్మెల్యే పట్టించుకోకుండా నూతన భవనాలను ప్రారంభించడం గమనార్హం. ప్రోటోకాల్ సమస్యపై పంచాయితీ కార్యదర్శి శివప్రసాద్‌ను వివరణ కోరగా ప్రారంభోత్సవానికి సర్పంచ్‌ను ఆహ్వానించినా అయినా ఆమె హాజరుకాలేదన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 24: గొల్లప్రోలు ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలు, సప్తాహ మహోత్సవాల ఏర్పాట్లుకు శనివారం శ్రీకారం చుట్టారు. అర్చకుల మంత్రోశ్చారణల మధ్య శివాలయ కమిటీ మాజీ చైర్మన్ మొగలి అప్పారావు దంపతులు పందిరిరాట ముహూర్తం చేశారు. మార్చి 2నుంచి 8వ వరకూ సప్తాహ మహోత్సవాలు జరగనున్నాయి. 168 గంటలపాటు నిరంతరాయంగా భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మహాకుంభాభిషేకానికి ఏర్పాట్లు

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 24: ఇర్రిపాక గ్రామంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి కోటి మట్టి శివలింగాలతో మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. వేలసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో నెహ్రూ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఏలేరు నదిలో భక్తులు స్నానాలచరించేందుకు ప్రత్యేక వసతులు స్నానరేవులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక క్యూలు, చలువ పందిళ్ల వేయించారు. జగ్గంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.లక్ష్మణరావు పరిశీలించి పలు సూచనలిచ్చారు.

దీక్షితాత్మభాస తిరుమలేశ శతకం ఆవిష్కరణ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 24: వర్శిటీలోని సెనేట్ హాల్లో స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రత్యేకాధికారి ప్రొఫెసర్ జీవీఆర్ దీక్షితులు రచించిన దీక్షితాత్మభాస తిరుమలేశ శతకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ సుమలత, విశిష్ట అతిథిగా టీ.కళ్యాణ చక్రవర్తి, గౌరవ అతిథిగా యూసీఈకే ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్,పలువురు డైరెక్టర్లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సస్యరక్షణ చర్యలు పాటించాలి'

పెద్దాపురం, ఫిబ్రవరి 24: ప్రస్తుత వరిసాగులో మేలైన సస్యరక్షణ చర్యలను పాటించాలని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. స్థానిక వ్యవసాయా పరిశోధనా స్థానంలో ప్రస్తుత వరి సాగుపై క్షేత్రస్థాయి సందర్శన, సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సీతారామశర్మ, రామభద్రరాజు, ప్రదీప్, సుధీర్, జ్యోతిర్మయి, మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 24: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వారికే తమ ఓటు అని ప్రత్తిపాడు నియోజకవర్గ యూటీఎఫ్ నాయకులు తెలిపారు. శనివారం స్థానిక తోట వీధిలోని టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజాను నియోజకవర్గ యూటీఎఫ్ నాయకులు కలిసి ఓట్ ఫర్ ఓపీఎస్‌అంటూ వినతి అందజేశారు. యూటీఎఫ్ నేతలు కోడి శ్రీనివాస్, దొడ్డిపట్ల రాజబాబు, ఈవీ రమణ, ఎస్.వీరబాబు, చుక్కల గణేష్, సీతారామరావు, రామలింగేశ్వరుడు, జి.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 24: కరెంటు బిల్లులు పెంచిన వైసీపీ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధమని జనసేన పీఏసీ సభ్యుడు, సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. 31వ డివిజన్ గొల్లల రామాలయం, సూర్యనారాయణపురంలో జనసేన మేము సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. కోటిబోయిన సతీష్, అలి చిన్ని పాల్గొన్నారు.

రేపు పంచాయతన క్షేత్రం శంకుస్థాపన

గండేపల్లి, ఫిబ్రవరి 24: తత్వం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున మండలంలోని పి.నాయకంపల్లి గ్రామంలో శివ పంచాయతన క్షేత్రం శంకుస్థాపన జరగనుంది. ప్రముఖ ప్రవచన కర్తలు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముకశర్మ, ముదిగొండ శంకరశర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి, డాక్టర్ అనంతల క్ష్మి, శంకరమంచి రామకృష్ణశర్మ, భగవద్గీత గంగాధర్‌శాస్త్రి, మైలవరపు శ్రీనివాసరావు, ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి, ప్రముఖ వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, సౌందర్యలహరి కొండూరి పద్మావతి, నిట్టల కిరణ్మయి, హిందూ జనశక్తి లలిత్, ప్రముఖ సామాజికవేత్త స్ట్రింగ్ వినోద్, ప్రముఖ పారిశ్రామకవేత్త చైతన్యరాజు, టి.రమేష్ గుప్తా, కె.సతీష్, శివశక్తి శ్రీ కరుణాకర్‌సుగ్గున, ట్రస్ట్ సభ్యులు ప్రభాకర్, బీజేపీ తెలంగాణ కార్యవర్గ సభ్యురాలు గీతామూర్తి, అమోగ్ విచ్చేస్తారు.

స్కేటింగ్ పోటీల ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 24: కాకినాడ రాజా ట్యాంక్ పార్కు ఆవరణలో డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్కేటింగ్ రింక్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలను కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే వంగా గీత, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రాజగోపాల్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఏడీసీ సిహెచ్‌నాగనరసింహరావు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన శ్రేణుల సంబరాలు

ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ప్రకటన
హర్షం వ్యక్తం చేసిన కార్యకర్తలు
కేక్ కటింగ్‌లు, బాణసంచా కాల్చివేత



సర్పవరం జంక్షన్: కేక్ కట్ చేసిన పంతం నానాజీ, తాళ్లరేవు: కేక్ కట్ చేస్తున్న టీడీపీ మహిళలు

పెద్దాపురం, ఫిబ్రవరి 24: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప టీడీపీ అధినేత చంద్రబాబును అమరావతిలో శనివారం కలిశారు. టీడీపీ, జనసేన పార్టీ పెద్దాపురం నియోజకవర్గానికి ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన తరువాత చంద్రబాబును, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ధన్యవాదాలు తెలియచేశారు. టీడీపీ, జనసేన విజయానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉమ్మడి అభ్యర్థిగా ఎమ్మెల్యే చినరాజప్ప పేరును ప్రకటించడంతో ఆ పార్టీకి చెందిన నేతలు స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద శనివారం సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చుతూ, మిఠాయిలు పంచారు. తమ నాయకుడిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. నియోజకవర్గ అభ్యర్థిగా ఖరారైన తరువాత రాజప్ప అమరావతి నుంచి నియోజకవర్గ పరిధిలోని జె.తిమ్మాపురం గ్రామానికి చేరుకోవడంతో టీడీపీ నేత కందుల విశ్వేశ్వరరావు, టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. వందలాదిగా జె.తిమ్మాపురం గ్రామ జంక్షన్‌కు చేరుకుని పూలమాలలతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి నేరుగా ప్రచార రథంపై విజయ చిహ్నం చూపిస్తూ కట్టమూరు, పెద్దాపురం మీదుగా అచ్చంపేటకు చేరుకున్నారు.

సామర్లకోట: పెద్దాపురం నియోజకరవర్గ టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఖరారు కావడంతో సామర్లకోట పట్టణం, మండలంలోనూ టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, ఎమ్మెల్యే చినరాజప్ప సన్నిహితుడు డబుల్ సెవెన్ రాజు తదితర పార్టీ నాయకులు మండలంలోని అన్ని గ్రామాలు పర్యటించి పార్టీ గెలుపునకు సహకరించాలని కోరారు. అన్ని గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి పలువురికి మిఠాయిలు పంచారు. శనివారం రాత్రి పెద్దాపురం మీదుగా సామర్లకోటకు చినరాజప్ప చేరుకోగా పార్టీ నాయకులు పెద్దాపురం రోడ్డు ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం నుంచి మండలంలోని అచ్చంపేట వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అడుగడుగునా రాజప్పను పూలమాలలతో ముంచెత్తి అభినందించారు. భారీ బాణాసంచా కాల్చారు. ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించేందుకు పార్టీ శ్రేణులందరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు.

జగ్గంపేటలో...

జగ్గంపేట, ఫిబ్రవరి 24: జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూను ప్రకటించడంతో శనివారం జగ్గంపేట టీడీపీ కార్యాలయం వద్ద స్వీట్లు పంచుకుని నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. జగ్గంపేట గ్రామదేవత రావులమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని అక్కడ నుంచి ఇర్రిపాక చేరుకుని నెహ్రూకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆశీస్సులతో జగ్గంపేట నియోజకవర్గంలో టీడీపీ, జనసేన జెండాలు ఎగురవేసి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్యదొర,మారిశెట్టి భద్రం, అడబాల వెంకటేశ్వరరావు, కోర్పు సాయితేజ, జాస్తి వసంత్, అడబాల రామాంజనేయులు, దేవరపల్లి మూర్తి, అడబాల భాస్కరరావు, పైడిపాల సూరిబాబు, రాయిసాయి, తమటం వీరభద్రరావు, సర్వసిద్ద లక్ష్మణరావు, బుర్రి సత్తిబాబు, యల్లమిల్లి సీఎం, జంపన రవివర్మ, చెలికాని హరిగోపాల్ పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూను ప్రకటించడంతో శృంగరాయుని పాలెంలో పట్టు చంటిబాబు, ఉప సర్పంచ్ బొజ్జపు శ్రీను, ఎంపీటీసీ గరగ గోవిందు, టీడీపీ సీనియర్ నాయకులు గొడేబాల, అల్లుమల్ల బాబి, అల్లుమల్ల వెంకన, బొజ్జపు నాగేశ్వరరావు సంబరాలు నిర్వహించారు.

తోటపేటలో...

తాళ్లరేవు, ఫిబ్రవరి 24: ముమ్మిడివరం నియోజకవర్గ ఉమ్మడిఎమ్మెల్యే అభ్యర్థిగా దాట్ల బుచ్చిబాబును అధిష్టానం ప్రకటించడంతో పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామం టీడీపీ బూత్ ఇన్‌చార్జి వూడా వెంకటరామకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ,జనసేన కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కేకు కట్‌చేసి పంచారు. బాణసంచా పేల్చారు. టీడీపీ నాయకులు జనిపల్లి ఈశ్వరరావు, రేవు గోవరాజు, వూడా సత్తిబాబు, రేవు సత్యనారాయణ, దున్నా మహేంద్ర, దడాల రాంబాబు, వార్డు సభ్యురాలు దున్నా సాయమ్మ, మాజీ చైర్మన్ వూడా సత్యవతి, సాదనాల కోటేశ్వరి, ఇంత సత్యనారాయణమ్మ, వూడా రెడ్డమ్మ ఉన్నారు.

అప్పలరాజు పేటలో...

కోటనందూరు, ఫిబ్రవరి 24: యనమల దివ్యను తుని నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మేజార్టీతో నెగ్గించుకుంటామని భీమవరపుకోట ప్రజలు అన్నారు. అప్పలరాజు పేట గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అధ్వర్యంలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లిన దివ్యకు ప్రజలు హారతులతో స్వాగతం పలికారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టనున్న సంక్షేమ పథకాలను వివరించారు. దివ్య టిక్కెట్టు ఇవ్వడంపై టీడీపీ మండల నేతలు హర్షం వ్యక్తం చేశారు. యనమల శివకృష్ణన్, అంకంరెడ్డి రమేష్, భీమిరెడ్డి అప్పలనాయుడు, సుర్ల సావిత్రి, లెక్కల బాస్కర్ ఉన్నారు.


ఉప్పాడ రేవులో సముద్రస్నానాలు చేస్తున్న భక్తులు

ఉప్పాడ రేవులో పుణ్యస్నానాలు

ఉప్పాడ (కొత్తపల్లి), ఫిబ్రవరి 24: మాఘపౌర్ణమి సందర్భంగా శనివారం ఉప్పాడ రేవులో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారుజామున పిఠాపురం నుంచి శ్రీకుంతీ మాధవస్వామిని రథంపై ఊరేగించుకుంటూ ఉప్పాడ రేవుకు తీసుకొచ్చి చక్రస్నానం చేయించారు. అనంతరం వేలాది మంది భక్తులు సముద్రంలో స్నానాలు ఆచరించారు. సముద్ర స్నానాలు చేయడంలో కెరటాల మధ్యలోకి వెళ్లకుండా కొత్తపల్లి పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

తొండంగిలో...

తొండంగి, ఫిబ్రవరి 24: మాఘపౌర్ణమి సందర్భంగా అద్దరి పేట నుంచి చోడిపల్లి పేట వరకూ ఉన్న వివిధ రేవుల్లో భక్తులు పుణ్యస్నానాలాచరించారు. ఒంటిమామిడిలో విశ్వేశ్వర ఆలయం వద్ద జరిగిన జాతర అనంతరం భక్తులంతా పుణ్యస్నానాలకు వెళ్లారు. దీంతో అద్దరిపేట దానవాయిపేట, ఒంటిమామిడి, పెరుమాళ్ళపురం తదితర తీరరేవులన్నీ జనంతో కిటకిటలాడాయి. స్నానాల అనంతరం తీరంలో వివిధ ఆలయాలను భక్తులు సందర్శించి పూజలు నిర్వహించారు. ఏ అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఎస్ఐ వినయ్ ప్రతాప్ 30 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు.

'27న ద్వారంపూడి ఇంటి ముట్టడి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 24: మత్స్యకార జాతిని కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి 2 రోజుల్లోగా మత్స్యకారులకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో దళితులమంతా ఏకమై తమ నాయకుడు కొండబాబు అనుచరులతో కలిసి ఈనెల 27న కాకినాడలోని ద్వారంపూడి ఇంటిని ముట్టడిస్తామని కాకినాడ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లాబత్తుల అప్పారావు, పలివెల రవి అనంతకుమార్ హెచ్చరించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో వారు మాట్లాడారు. మత్స్యకారులకు క్షమాపణ చెప్పకుండా కల్లబొల్లి మాటలతో పబ్బం గడుపుతున్న ద్వారంపూడికి 2 రోజుల గడువుతో డెడ్‌లైన్ ఇస్తున్నామన్నారు. ఆ లోగా క్షమాపణ చెప్పని పక్షంలో 27న కాకినాడలో ఏదో ఒక చోట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి ద్వారంపూడి ఇంటి ముట్టడికి వెళతామన్నారు. ఈ సమయంలో జరిగే పరిణామాలకు ద్వారంపూడి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సీకోటి అప్పకొండ, అంబటి చిన్న, బంగారు సత్యనారాయణ, బుంగా నాగరాజు, బత్తుల ఉమాదేవి, వానపల్లి జ్యోతి, సామంతుల నాగేంద్రప్రసాద్, ముడే రాజబాబు, పుష్కల నెహెమ్యా తదితరులు పాల్గొన్నారు.

'ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి'

తాళ్లరేవు, ఫిబ్రవరి 24: మత్స్యకారులను అవమానించిన కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి క్షమాపణ చెప్పాలని కోరుతూ తాళ్లరేవు మండల అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో గుడ్డివానితూము సెంటరులో శనివారం మత్స్యకారులు దర్నా చేశారు. మత్స్యకార నేత వాడ్రేవు వీరబాబు మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ జాతిని అవమానించిన ఎమ్మెల్యే ద్వారంపూడి రాబోయే రోజుల్లో ఎలా గెలుస్తాడో చూస్తామని హెచ్చరించారు. మత్స్యకార నాయకులు బర్రే లక్ష్మీనరసింహరాజు, వైదాడి నూకరాజు, సంగాడి కామేశ్వరరావు, మల్లాడి సీతారామరాజు, మల్లాడి వరదరాజు, పినపోతు సోమరాజు, లంకే నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కాకినాడ క్రైం ఫిబ్రవరి 24: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం కాకినాడలో జరిగింది. స్థానిక జగన్నాధపురానికి చెందిన కాలాడి పవన్‌కుమార్ (27) ఓ ప్రైవెటు సంస్థలో ఉద్యోగం చేస్తుంటాడు. కాగా అతడు శనివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై స్థానిక పాత బస్‌స్టాండ్ తన అత్తారింటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న ఓ కారు పవన్‌కుమార్ వాహనాన్ని బలంగా ఢీకొంది. దాంతో పవన్‌కుమార్‌కు బలమైన గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ వాడవల్లి సురేష్‌బాబు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు


తునిలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణుడు

తుని రూరల్, ఫిబ్రవరి 24: ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, సీఎం జగన్‌ని ఇంటికి పంపేందుకు సమయం ఆసన్నమైందని టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు స్పష్టం చేశారు. తమ ప్రాణం ఉన్నంతవరకు తమ సోదరుడు యనమల రామకృష్ణుడు, తాను కలిసే ఉంటామని తమ మధ్య ఎటువంటి విభేదాలు ఉండబోమని తెలిపారు. తుని 22వ వార్డు రామకృష్ణకాలనీకి చెందిన వైసీపీ నాయకులు ఆయన ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో కందుల శ్రీను, కందుల కపిల్, డి.తాతారావు, సానపల్లి మణికంఠ, ప్రశాంత్, నాగేంద్ర, కీర్తి నవీన్ పలు కుటుంబాలు ఉన్నాయి. మాజీ వార్డు కౌన్సెలర్ సిద్దాంతపు సత్తిబాబు, రమణమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

భీమవరపుకోటలో...

కోటనందూరు: భీమవరపుకోట గ్రామంలో మాజీ జడ్పీటీసీ పెంటకోట భాస్కర సత్యనారాయణ ఆధ్వర్యంలో తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య సమక్షంలో వైసీపీ కార్యకర్తలు దండా చినరాజు, మాసా రవి, సుర్ల మనిబాబు, పెంకోట దివాకర కొండబాబు, పేటకోట జగదీశ్వరరావు తదితరులు 50మంది వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వారికి దివ్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యనమల శివరామకృష్ణన్, మేడపురెడ్డి జోగిబాబు, అల్లంపల్లి నర్సింహమూర్తి తదితరులు ఉన్నారు.

ఇర్రిపాకలో...

జగ్గంపేట: ఇర్రిపాకలో కిర్లంపూడి మండలం టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ పాఠంశెట్టి రవి ఆధ్వర్యంలో బూరుగుపూడి గ్రామానికి చెందిన బాలిన వీర వెంకటరమణ (ఎర్రిబాబు) నాయకత్వంలో బాలిన కుటుంబం వైసీపీకి రాజీనామా చేసి 100 మంది టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. నెహ్రూను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో బాలిన కుటుంబ సభ్యులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠంశెట్టి రవి, కుంచే తాతాజీ, బాలుకుల సుబ్బారావు, కర్నాకుల పెద్దకాపు, పాఠంశెట్టి నాగేశ్వరరావు, పాఠంశెట్టి కొండరాజులు, పాఠంశెట్టి బాబ్జి,మూర సత్తిబాబు, తోట వెంకటేశ్వరరావు, మంచిన బాబ్జి, కుంచే శ్రీను, కొప్పన పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

కొంతంగిలో...

శంఖవరం: కొంతంగిలో నడిగట్ల ఏడుకొండలు, పులపర్తి వెంకట్, గట్టెం సురేష్, పులపర్తి సురేష్, అమరాది శేఖర్ తదితర 50 కుటుంబాలు వైసీపీని వీడి ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, ముదునూరి మురళీకృష్ణంరాజు, నియోజకవర్గ యువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుభాష్, సర్లం గోవిందు, బద్ది లోవరాజు, ఉల్లి వీరభద్రరావు, బద్ది రమణ, ఓలేటి లక్ష్మీనారాయణ, పోలం చిన్నా, ఈగల దేవుళ్ళు, కర్రి శివాజీ, కృష్ణ, ప్రగడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర సంపదను లూటీ చేసిన వైసీపీ నేతలు'


గోకివాడలో ప్రచారం చేస్తున్న వర్మ

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 24: టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలైన ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసి వైసీపీ నేతలు మాఫియాగా ఏర్పడి రూ.50వేల కోట్లు రాష్ట్ర సంపదను లూటీ చేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. పిఠాపురం మండలం గోకివాడలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్జీటీ అక్రమాలపై ఆగ్రహం వ్యక్తం చేసినా రాష్ట్రంలో ఇసుకదోపిడి మాత్రం ఆగలేదని వర్మ విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బర్ల అప్పారావు, నామా పద్దరాజు, లక్ష్మీనారాయణ, దాసం సత్తిబాబు, నాగబాబు, శ్రీను, అడ్డగర్ల శివ, చిరంజీవిరాజు పాల్గొన్నారు.

పిఠాపురం: సూర్యరాయ డిగ్రీ కళాశాలలో తొలిసారి ఓటుహక్కు పొందిన విద్యార్థులతో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడారు. అర్బ న్‌బ్యాంకు మాజీ చైర్మన్ దేవరపల్లి రామారావు, తెలుగు యువత, తెలుగు మహిళ పిఠాపురం నియోజకవర్గ అధ్యక్షులు నల్లా శ్రీను, పంపనబోయిన అన్నపూర్ణ, రావు అక్షయ్, ప్రవేట్ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు సుంకర అనిల్‌కుమార్ తదితరులున్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 24: సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో ప్రొక్సెలెరా సంస్థ భాగస్వామ్యంతో 2రోజులపాటు జరిగిన ఇంటర్వ్యూలు శనివారం ముగిశాయి. ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ, ఫౌండేషన్ ప్రతినిధులు నియామకపత్రాలు అందజేశారన్నారు. ఈనెల 27, 28న ఐటీ, నాన్‌ఐటీ రంగాల్లోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుపుతామని, నిరుద్యోగులు పాల్గొనవచ్చన్నారు. సంస్థ సీఈవో మోహన్ రాఘవేంద్ర, వైస్ ప్రెసిడెంట్ కె.గురుప్రసాద్, డైరెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.

డీఎంఈ ఆకస్మిక తనిఖీలు

జీజీహెచ్ (కాకినాడ) ఫిబ్రవరి 24: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డా.డీఎస్‌వీఎల్ నరసింహం జీజీహెచ్‌లో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డా.ఎంపీఆర్ విఠల్‌తో కలిసి మెడికల్, సర్జికల్, ఆర్థో, పల్మానాలజీ, కార్డియాలజీ, రెడియాలజీ, సైకియాట్రి ఓపీలను... ఇటీవల రోగుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఈవినింగ్ క్లీనిక్స్‌ను సందర్శించి పరిశీలించారు. అక్కడ పేసెంట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ వారిని ఏఏ వైద్య పరీక్షలకు తరలించిన ప్రక్రియ వారికి అందించే చికిత్సా విధానానికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిని కార్పొరేట్‌కు దీటుగా తీర్చిద్దిదేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.విష్ణువర్ధన్, డా.దేవీమాధవి, జీజీహెచ్ డిప్యూటీ సూపరిండెంట్ డా.హరివిజయకుమార్, ఫోరెన్సిక్ హెచ్‌వోడి డా.ఉమామహేశ్వరరావు, వివిఎస్ఆర్ఎంట డా.పుష్కరావు, డిసీఎస్ఆర్ఎంట డా.కోనాల అనిత ఉన్నారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు


పుష్పాలంకరణలో స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఫిబ్రవరి 24: రత్నగిరివాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా శనివారం మూలవరులకు పంచామృతాభిషేకలు, విశేషపూజలు నిర్వహించారు. వేకువజామున 2గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. మ హన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాల అనంతరం పంచామృతాలతో అభిషేకించారు. పట్టుపీతాంబరాలతో నూతన వస్త్రాలను ధరింపచేసి వివిధ సుగంధభరిత పుష్పాలతో అలంకరింపచేశారు. చతుర్వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శనివారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు.

బాలసుబ్రహ్మణ్యేశ్వర విగ్రహ ప్రతిష్ఠ


బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి జలాభిషేకం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 24: దుర్గాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. విఘ్నేశ్వర పూజ, కళాహోమాలు, మూర్తిమంత్ర హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాసములు, గోదృష్టి, మహాపూర్ణాహుతి నిర్వహించారు. స్వామి వాసుదేవానంద భారతి స్వామిజీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య కార్యక్రమాలు జరిగాయి. ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పార్లమెంట్ వైసీపీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు. భారీ అన్నసమారాధన జరిగింది.

మరిడమ్మకు పంచామృతాభిషేకం

పెద్దాపురం, ఫిబ్రవరి 24: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారి జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని శనివారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. వేదపండితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తరలిరాగా ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో వేదపండితులు, అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు పాల్గొన్నారు.

వైభవంగా కుక్కుటేశ్వర క్షేత్ర ప్రదక్షిణ

పిఠాపురం, ఫిబ్రవరి 24: పట్టణంలో పాదగయలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి క్షేత్ర ప్రదక్షిణ శనివారం వైభవంగా జరిగింది. పాదగయ కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం నుంచి హరహర శంకర, జయజయ శంకర నామస్మరణతో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను పల్లకీపై ఉంచి ప్రదక్షిణ గావించారు. ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, పతంజలి యోగా సమితిసభ్యులు ఉన్నారు.

జార్జీపేటలో కలశాలతో ఊరేగింపు

తాళ్లరేవు, ఫిబ్రవరి 24: జార్జీపేట గ్రామంలో శ్రీమహాలక్ష్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మహిళలు కలశాలతో శనివారం జమ్మిచెట్టు సెంటర్ నుంచి ఆలయం వరకు ఊరేగింపు చేశారు. అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదములను స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు బారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పైపులైన్ పనుల పరిశీలన

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 24: కాకినాడ శారదా దేవి ఆలయ ప్రాంతంలో జరుగుతున్న పైపులైన్ మరమ్మతు పనులను నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శనివారం పరిశీలించారు. ఆదివారం ఉదయానికల్లా పనులు పూర్తి చేసి ప్రజలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ సుబ్బారావు, ఏఈ వై.నాగేశ్వరరావు, టేప్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

ఏలేశ్వరం, ఫిబ్రవరి 24: పట్టణంలో చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో హెచ్ఐవీ వ్యాధి నివారణ చర్యలు, అవగాహనపై టి.పవన్ కుమార్ కళాజాత బృందంతో నాటక ప్రదర్శనలు చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రక్తదానం చేసేవారు ఏఏ జాగ్రత్తలు పాటించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో జె.సాయిసుధ, టి.సత్యవతి, జికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆదిత్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్

గండేపల్లి, ఫిబ్రవరి 24: ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఆదిత్ 2024 మేనేజ్‌మెంట్ ఫెస్ట్ శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా ప్రముఖ గాయకుడు అనురాగర్ కులకర్ణి హాజరై వివిధ పోటీల్లో ప్రతిభావంతులకు బహుమతి ప్రదానం చేశారు. డైరెక్టర్ సుగుణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయభార్గవి, గోవర్ధనరెడ్డి, విద్యార్థులు ఉన్నారు.